మోడల్ స్కూల్ విద్యార్థినికి స్టేట్ 3వ ర్యాంక్

వర్షిణి

గంగాధర, ఏప్రిల్ 24: గంగాధర మోడల్ స్కూల్ ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఆర్ వర్షిణి 466/470 మార్కులు సాధించి ప్రభుత్వ కళాశాలల సెక్టార్‌లో స్టేట్ 3వ ర్యాంక్, మోడల్ స్కూల్ సెక్టార్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 13 మంది, బైపీసీలో నలుగురు విద్యార్థులు 900కు పైగా మార్కులు సాధించారు. సీఈసీలో నలుగురు విద్యార్థులు 890కి పైగా మార్కులు సాధించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీలో 30 మంది, బైపీసీలో ఇద్దరు, సీఈసీలో నలుగురు విద్యార్థులు 400కి పైగా మార్కులు సాధించారు. కాగా, విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ గోల్డీ బల్బీర్‌కౌర్, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎల్ఎండీలో దూకి వివాహిత ఆత్మహత్య

తిమ్మాపూర్, ఏప్రిల్24: కుటుంబ కలహాలతో ఎల్ఎండీలో మహిళ దూకి ఆత్మహత్య చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిగురుమామిడికి చెందిన పుల్లూరి అనూష(32) నగరంలోని ఓ బ్యాంకులో పని చేస్తూ కుటుంబంతో కలిసి కరీంనగర్‌లోనే నివసిస్తున్నది. ఈక్రమంలో కుటుంబ కలహాలతో మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబసభ్యులు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు, కుటుంబసభ్యులు గాలించగా బుధవారం తెల్లవారుజామున ఎల్ఎండీ రిజర్వాయర్‌లో మృతదేహం దొరికింది. పోలీసులు అనూష మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా కడార్ల విమల్ కుమార్ S/o. విద్యాసాగర్ R/o. భగత్‌నగర్, కరీంనగర్ గారు "మార్టిగేజ్ లోను" నిమిత్తము కరీంనగర్ టౌన్‌లోని A.O.S. కాలనీ, సప్తగిరి కాలనీ (రాంపూర్) నందు సర్వే నెం. 964/A, ప్లాటు నెం.9, విస్తీర్ణం : 197.08 చ.గ.లలో నిర్మితమైన RCC బిల్డింగ్ నెం. 8-3-355/1/A/1 గల దానిని నాక్లయింటు LIC HOUSING FINANCE LTD కరీంనగర్ బ్రాంచ్ వారికి తనఖా పెట్టుటకు దరఖాస్తు సమర్పించియున్నారు. లోగడ కడార్ల విమల్ కుమార్ గారు ఇట్టి ఇంటి ప్లాటును కడార్ల ప్రభావతి, W/o. విద్యాసాగర్ R/o. భగత్‌నగర్ కరీంనగర్ గారి నుండి రిజిష్టర్డ్ గిఫ్ట్ డీడ్ నెం. 4585/2021 ద్వారా పొందియున్నారు. ఇట్టి డాక్యుమెంటు యొక్క ఒరిజినల్ లింకు డాక్యుమెంటు రిజిష్టర్డ్ సేల్‌డీడ్ నెం. 1187/1983 గల డాక్యుమెంట్ పోయినదని కడార్ల విమల్ కుమార్ గారు తెలిపినారు. కావున ఇట్టి డాక్యుమెంటు పై గాని, పై ప్రాపర్టీ పై గాని ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న యెడల వ్రాతపూర్వక ఆధారాలతో (15) రోజులలో క్రింది చిరునామాలో గల వారికి తెలుపగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరములు లేవని భావించి సదరు లోను మంజూరు విషయంలో LIC HOUSING FINANCE LTD కరీంనగర్ బ్రాంచ్ వారు ప్రొసీడుకాగలరు.

ఇట్లు: సాన చంద్రమోహన్
అడ్వకేట్ (TS/138/1995) ప్లాట్ నెం.303, శ్రీసాయి ఎవెన్యూ ముకరంపుర, కరీంనగర్.
సెల్ :9666077777, 9141499999

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

బండి.. ఎంపీగా ఏం చేసినవ్

సైదాపూర్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, పక్కన మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, తదితరులు

- ఐదేండ్లలో ఐదు రూపాయలు తేలేని అసమర్థుడు
- అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ సర్కారు
- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బీ వినోద్‌కుమార్
- చిగురుమామిడి, సైదాపూర్‌లో మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్‌కుమార్, రసమయితో కలిసి రోడ్‌షో
- కారుకు ఓటేసి ఢిల్లీకి పంపించాలని విజ్ఞప్తి

చిగురుమామిడి/సైదాపూర్ ఏప్రిల్ 24 : కరీంనగర్ ఎంపీగా ఐదేండ్లు పదవి అనుభవించిన బండి సంజయ్ నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేంటో చెప్పు? గుడికో బడికో కనీసం ఐదు రూపాయలు కూడా ఎందుకు తేలేదని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శనాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ సర్కారు అబద్ధాల పునాదులపై ఏర్పడ్డదని మండిపడ్డారు. తాను గతంలో ఎంపీగా ఉన్న సమయంలో రూ. వెయ్యి కోట్లు మంజూరు చేయించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో బుధవారం ఆయన మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్‌కుమార్, రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్‌తో కలిసి రోడ్‌షోల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడారు. 2004లో బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు ఎంపీలను గెలిపిస్తే 32 రాజకీయ పార్టీలను ఒప్పించి తెలంగాణ సాధించామన్నారు. గోదావరి, కృష్ణా జలాల్లో వాటా కోసం అలుపెరగని పోరాటం చేశామన్నారు. మతాన్ని అడ్డుపెట్టుకొని గెలిచిన బండి సంజయ్ అభివృద్ధిని విస్మరించారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. కల్యాణలక్ష్మి కింద రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని మోసం చేసిందని నిప్పులు చెరిగారు. క్వింటాల్ వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి బోగస్ చేసిందన్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ఎప్పటి వరకు ఉంటారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. పిచ్చోడి చేతిలో రాయిలా కాంగ్రెస్ ప్రభుత్వం కొట్టుమిట్టాడుతుందన్నారు. చెరువులు, కుంటలు అడుగంటడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉంటే నేడు చెరువులు, కుంటలు కళకళలాడేవన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం హుస్నాబాద్, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్‌కుమార్, రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, కేసీఆర్ వల్లే మిడ్ మానేరు ద్వారా గోదావరి జలాలను చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు తీసుకువచ్చామన్నారు. 24 గంటల కరెంట్ ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ సర్కారుదేనని చెప్పారు. ఎంపీగా బండి సంజయ్ చిగురుమామిడికి ఎన్నిసార్లు వచ్చారని, ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. కారు గుర్తుకు ఓటేసి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, ఎంపీపీ కొత్త వినీత-శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆకవరం భవాని, జిల్లా నాయకులు సాంబారి కొమురయ్య, ఆకవరం శివప్రసాద్, తిరుపతి, కృష్ణమాచారి, సైదాపూర్‌లో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, జడ్పీ వైస్ చైర్మన్ పేరాల గోపాలరావు, ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్‌రెడ్డి, నాయకులు చంద శ్రీనివాస్, ముత్యాల వీరారెడ్డి, కొండ గణేశ్, అబ్బిడి రవీందర్‌రెడ్డి, పైడిమల్ల తిరుపతి, రాములు, రవీందర్ రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద రోడ్‌షోకు తరలివచ్చిన ప్రజలు

చిగురుమామిడి: మండల కేంద్రంలో..

ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణపై శ్రద్ధ చూపాలి

వావిలాలపల్లి సబ్ స్టేషన్ లో ఉష్ణోగ్రతను పరిశీలిస్తున్న సీజీఎం అశోక్ కుమార్

ముకరంపుర, ఏప్రిల్ 24: పెరుగుతున్న ఎండతో ఉష్ణోగ్రత గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్నందున ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎన్పీడీసీఎల్ సీజీఎం, హెచ్ఆర్డీ డైరెక్టర్ అశోక్‌కుమార్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లి, ఎస్సారార్ కళాశాల విద్యుత్ ఉప కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. థర్మల్ కెమెరాతో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉష్ణోగ్రతలు తనిఖీ చేసి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటనెన్స్ నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ ఎమ్మార్టీ కాళిదాసు, కరీంనగర్ టౌన్, ఎమ్మార్టీ ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

ఆలయాలు ఆధ్యాత్మిక నిలయాలు

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని సన్మానిస్తున్న గౌడసంఘం నాయకులు

వీణవంక, ఏప్రిల్ 24: ఆలయాలు ఆధ్యాత్మిక నిలయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం నిర్వహించగా, ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని సన్మానించారు. ఆలయ అభివృద్ధికి రూ.లక్ష అందజేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ కూడా ఆలయానికి రూ. లక్షా పది వేలు ఇస్తారని కాంగ్రెస్ నాయకులు రఘుపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు పరిపాటి రవీందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ నిర్వాహకులు దూలం శ్రీనివాస్, కొండాల్, మాజీ సర్పంచ్ పంజాల అనూష-సతీశ్, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్ రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మే 6 నుంచి పురుషులకు సీసీ టీవీ సర్వీసింగ్‌లో 13 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణకాలంలో ఉచిత హాస్టల్ వసతి ఉంటుందని, శిక్షణ అనంతరం సర్టిఫికెటుల అందజేస్తామని తెలిపారు.

చిల్లర నాణేలతో నామినేషన్

నామినేషన్ పత్రంతో పాటు నాణేలను చూపుతున్న మానసారెడ్డి

కలెక్టరేట్, ఏప్రిల్ 24: కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న సైదాపూర్ మండలం బొమ్మకల్‌కు చెందిన పేరాల మానసారెడ్డి మంగళవారం వినూత్నంగా నామినేషన్ దాఖలు చేశారు. గంపలో రూ. 5, రూ. 10 నాణేలతో ఆర్వో ఆఫీసుకు చేరుకున్నారు. నామినేషన్ ఫీజు రూ. 25 వేలను ఈ కాయిన్స్ రూపంలో చెల్లించారు. కాగా నెత్తిన నాణేల బుట్టతో వస్తున్న ఆమెను పోలీసు, ఎన్నికల సిబ్బంది ఆసక్తిగా చూశారు.

వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

వినోద్‌కుమార్ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న విద్యార్థి నాయకులు

కార్పొరేషన్, ఏప్రిల్ 24: ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉండి ఎప్పటికప్పుడు పార్లమెంట్‌లో ప్రశ్నించి నిధులు తీసుకువచ్చే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, నాగరాజు, తిరుపతినాయక్ ప్రజలను కోరారు. వినోద్‌కుమార్ తరఫున బుధవారం నామినేషన్ సెట్‌ను దాఖలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కెంసారం తిరుపతి, సుధగోని శ్రీనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో కొర్రీలు పెట్టవద్దు

- తేమశాతం పేరిట రైతులను ఇబ్బందిపెట్టొద్దు
- రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

కార్పొరేషన్, ఏప్రిల్ 24: పూర్తిస్థాయిలో సెంటర్లు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సెంటర్లకు తీసుకువచ్చిన ధాన్యంలో తేమ శాతం లేదంటూ నిర్వాహకులు కొర్రీలు పెడుతూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1300 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెబుతున్నదని, వాస్తవానికి 400 కూడా ఏర్పాటు చేయలేదన్నారు. సెంటర్లలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. సర్కారు సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో మిల్లర్లకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో 15 లక్షల మెట్రిక్ టన్నుల మేరకు ధాన్యం వస్తుందని అంచనా వేశారని, ఇప్పటి వరకు లక్ష మెట్రిక్ టన్నులు కూడా కొనుగోలు చేయలేదన్నారు. మిల్లర్లతో ప్రభుత్వం కుమ్మక్కు అయిందని ఆరోపించారు. తక్కువ ధరతో మిల్లర్లు కొనుగోలు చేస్తున్న ధాన్యం ఎక్కడికి పోతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, తిరుపతి, చంద్రశేఖర్, చైతన్య, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

పోలీస్ అబ్జర్వర్‌ను కలిసిన కలెక్టర్

పోలీస్ అబ్జర్వర్‌కు మొక్క అందజేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కలెక్టరేట్, ఏప్రిల్ 24: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పోలీస్ అబ్జర్వర్‌గా జిల్లా కేంద్రానికి వచ్చిన మనీష్ చౌదరిని బుధవారం రాత్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ల ప్రక్రియ సజావుగా కొనసాగుతున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు ఉన్నారు.

భూ ఆక్రమణ కేసులో నలుగురి రిమాండ్

రాంనగర్, ఏప్రిల్ 24: నగరంలో ఓ స్థలానికి సంబంధించి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అసలు యజమానులను వేధింపులకు గురి చేసి డబ్బులు దండుకున్న ఘటనలో 12 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో బుధవారం మహ్మద్ ఫిరోజ్, నాంపల్లి రామాంజనేయులు, శ్రీకాంత్, రాజును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో పోలీసులు జిల్లా జైలుకు తరలించారు.

విద్యార్థులకు అభినందన

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 24: జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాల హిందీ విభాగం విద్యార్థులు 'సోషల్ మీడియాలో హిందీ భాష : ఒక అధ్యయనం' అంశంపై చేసిన స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్‌కు జిజ్ఞాస రాష్ట్ర స్థాయి తృతీయ పురస్కారం లభించింది. హిందీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వరప్రసాద్ వాసాల పర్యవేక్షణలో జరిగిన ఈ స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్‌ను మహ్మద్ ముజ్తబా, మహ్మద్ ఆసిఫ్, షేక్ షర్జీల్, సయ్యద్ ఖాజా మొయినొద్దీన్, సర్దార్ మన్‌ప్రీత్‌సింగ్, తదితరులు ప్రాజెక్ట్‌ను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమర్థవంతంగా వివరించారు. వీరు త్వరలో హైదరాబాద్‌లో జరిగే అభినందన సమావేశంలో రూ. 10,000 నగదుతో పాటు సర్టిఫికెట్లను కళాశాల విద్యాశాఖ కమిషనర్ చేతుల మీదుగా అందుకోనున్నారు. హిందీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వరప్రసాద్ వాసాలతో పాటు విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రమోద్‌కుమార్, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్, కళాశాల జిజ్ఞాస సమన్వయకులు డాక్టర్ భాస్కర్, కళాశాల పాలనాధికారి కామరాజ్ అభినందించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 24: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి ఆయన జిల్లా ఎన్నికల అధికారులతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, ఈనెల 25 నాటికి ఓటర్ల తుది జాబితా రూపొందించాలని స్పష్టం చేశారు. ప్రతి ఓటరుకు ఓటరు సమాచార స్లిప్పులు తప్పనిసరి అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో క్యూలైన్ల వద్ద ప్రత్యేక వసతులు కల్పించాలని సూచించారు. జిల్లాలో వెబ్‌కాస్టింగ్ చేస్తున్న పోలింగ్ కేంద్రాల వివరాలు అందజేయాలని ఆదేశించారు. మిగతా పోలింగ్‌కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, డీఆర్వో పవన్‌కుమార్, సీపీవో కొమురయ్య, జడ్పీసీఈవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కమాన్‌చౌరస్తా/శంకరపట్నం/చొప్పదండి/చిగురుమామిడి/ హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 24: చిగురుమామిడి మండలం ముల్కనూర్ మోడల్ స్కూల్, హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మైనార్టీ బాలుర గురుకుల కళాశాల విద్యార్థులు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ప్రతిభ చూపారు. అలాగే, శంకరపట్నంలోని మోడల్ స్కూల్, కేజీబీవీతో పాటు చొప్పదండి మండలం రుక్మాపూర్‌లోని మోడల్ స్కూల్, చొప్పదండిలోని చెందిన అల్ఫోర్స్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించగా ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ కే రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో రిషిత పటేల్ 983, వీ సాయిప్రియ 977, బైపీసీలో సనాఅంజుమ్ 968, సీఈసీలో మిషా మహవీన్ 965 మార్కులు సాధించారన్నారు. ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో అర్చన (ఏ అండ్ టీ) 972, శ్రీనిత్య (సీఎస్) 959, కీర్తి (ఎంఎల్‌టీ) 951, జీవిత ఫార్మటెక్‌లో 944 మార్కులు సాధించారన్నారు.

హుజూరాబాద్‌టౌన్: విద్యార్థిని అభినందిస్తున్న మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక సదస్సుకు ఓదెలుకుమార్ ఎంపిక

ఓదెలు కుమార్

చిగురుమామిడి, ఏప్రిల్ 24: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్కిట్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే రాష్ట్రస్థాయి వైజ్ఞానిక సదస్సుకు చిగురుమామిడి మండలం ఇందుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు భాషబత్తిని ఓదెలు కుమార్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు జయప్రద తెలిపారు. ఓదెలు కుమార్‌కు జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి, డీసీఈబీ సెక్రటరీ స్వదేశ్ కుమార్, అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 24: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 25 నుంచి మే 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ చలువాజి నాగేశ్వర్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల విషయంలో సందేహాలు ఉంటే సెల్ నంబర్ 83092 12661లో సంప్రదించాలని సూచించారు.

తహసీల్దార్‌కు వినతి

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 24: ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని బుధవారం తహసీల్దార్‌కు ఆటో యూనియన్ల జేఏసీ అధ్యక్షుడు సిరికొండ శరత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆటో యూనియన్ల జేఏసీ అధ్యక్షుడు సిరికొండ శరత్, నాయకులు ఎస్కే ఫయాజ్, కృష్ణ, ఎస్కే ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 24: నగరంలోని అపార్ట్‌మెంట్లలో ఉండే ఓటర్లంతా పార్లమెంటు ఎన్నికల్లో తమ ఓటు హక్కు విధిగా వినియోగించుకోవాలని మెప్మా టీఎంసీ అనిత, వీఏఆర్‌పీ పీవీ రాజ్‌కుమార్ కోరారు. నగరంలోని విజేత మనోహర రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో బుధవారం స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎం శ్రీవాణి, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు ఎం రవీందర్, అనిల్ రావు, ఎం కిష్టయ్య, వీరమల్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాష ప్రాధాన్యతపై వర్క్‌షాప్

ప్రొఫెసర్ ప్రసన్న లతను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సమత

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 24: నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ సమత ఆధ్వర్యంలో ఆంగ్ల విభాగం వారు డిజిటల్ యుగంలో ఆంగ్ల భాష ప్రాధాన్యతపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఇంగ్లిష్ కౌన్సిలర్, అంబేద్కర్ దూర విద్యా కేంద్రం రిటైర్డ్ అధ్యాపకుడు పరశురాములు, జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్నలత హాజరై మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సమత, అధ్యాపకులు అరుంధతి, పరిమళ, సుమన, ప్రేమజ్యోతి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ నవవధువు మృతి

మానకొండూర్, ఏప్రిల్ 24: మండలంలోని గట్టుదుద్దెనపల్లి శివారులో ఈనెల 22న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నవవధువు దామెర స్వాతి కరీంనగర్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. స్వాతి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

శంకరపట్నం, ఏప్రిల్ 24: ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ విమర్శించారు. తాడికల్‌లోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకుడు కనుకుట్ల శ్రీనివాస్ మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటస్వామి, తుంగ ఆంజనేయులు, దండు అంజయ్య, నాత్రి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఒకరి మృతి

గంగాధర, ఏప్రిల్ 24: వడదెబ్బతో ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని ముప్పిడినర్సయ్యపల్లిలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ముప్పిడినర్సయ్యపల్లికి చెందిన ముప్పిడి విద్యాసాగర్(42) రెండు రోజుల క్రితం కరీంనగర్ వెళ్లగా అస్వస్థతకు గురయ్యాడు. బుధవారం ఉదయం వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఆర్ఎంపీకి చూపించారు. తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని దవాఖానకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు.

ఏడో రోజు 13 నామినేషన్లు

కలెక్టరేట్, ఏప్రిల్ 24: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ స్థానానికి బుధవారం ఏడో రోజు 13 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఆరుగురు మొదటి సెట్లను, ఏడుగురు రెండు, మూడు, నాలుగు సెట్లను ఆర్వోకు సమర్పించారు. వీరిలో ఇండిపెండెంట్లుగా వేముల విక్రమ్‌రెడ్డి, గౌరిశెట్టి సురేశ్, శివరాత్రి శ్రీనివాస్, జంగం అపర్ణ, సూరం చంద్రశేఖర్, బరిగె గట్టయ్య రాణాప్రతాప్, గద్ద సతీశ్, కాంగ్రెస్ నుంచి అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు, బీఆర్ఎస్ తరఫున వినోద్‌కుమార్, తెలుగు కాంగ్రెస్ నుంచి చీకోటి వరుణ్ గుప్తా, భారతీయ యువకుల దళం నుంచి పెద్దపల్లి శ్రవణ్ నామినేషన్లు సమర్పించారు.

వాగేశ్వరిలో అలరించిన స్వాగతోత్సవం

తిమ్మాపూర్ రూరల్, ఏప్రిల్ 24: రామకృష్ణకాలనీలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఉద్భవ్-24 పేరిట స్వాగతోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ ఆటపాటలతో అలరించారు. కళాశాల జనరల్ సెక్రటరీ డా. శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ డా. శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాష్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, సంధ్యా రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'దళిత బంధు' ఇప్పిస్తానంటూ మోసం

తిమ్మాపూర్, ఏప్రిల్ 24: దళిత బంధు, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిని ఎల్ఎండీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొరండ్ల గ్రామానికి చెందిన మామిడిపల్లి అనిల్ ఈజీ మనీకి అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో తాను ఓ ప్రముఖ నేత వద్ద డ్రైవర్‌గా, అసిస్టెంట్‌గా పనిచేస్తున్నానని గ్రామంలో చెప్పుకున్నాడు. ఈ క్రమంలో దళిత బంధు, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని, సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తానని నమ్మించి కొద్ది నెలల క్రితం అదే గ్రామానికి చెందిన కొండ్ర అనిల్ వద్ద రూ.3.36 లక్షలు తీసుకున్నాడు. అయితే రోజులు గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో పాటు సదరం సర్టిఫికెట్ కూడా ఇప్పించలేదు. దీంతో బాధితుడు మామిడిపల్లి అనిల్‌ను నిలదీయగా, వాయిదాలు వేస్తూ వస్తున్నాడు. అనుమానం వచ్చి ఎల్ఎండీ పోలీసులకు ఫిర్యాదు చేయగా, రంగంలోకి దిగారు. ఎస్ఐ చేరాలు విచారణ చేపట్టి, మామిడిపల్లి అనిల్ మోసాలను గుర్తించి బుధవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎవరైనా బాధితులు ఉంటే తమను సంప్రదించాలని ఎస్ఐ చేరాలు తెలిపారు.